

చేనేత సంఘం నాడు రాష్ట్ర స్థాయిలో ఖ్యాతిగాంచింది. వందల మంది నేతన్నల కుటుంబాలకు ఉపాధి చూపింది. కాలక్రమేణ మర మగ్గాల ప్రవేశంతో చేనేతకు ఆదరణ తగ్గింది. చేనేత వస్త్రాల కొనుగోలు కూడా బాగా తగ్గింది. ఫలితంగా క్రమక్రమంగా చేనేత సంఘం దయనీయ స్థితికి చేరుకొని చివరకు మూతపడింది. దీంతో మగ్గం మూగబోయింది. ఇదీ ఆమనగల్లు చేనేత సహకార సంఘం దుస్థితి.

- మర మగ్గాలతో చేనేతకు తగ్గిన ఆదరణ
- కుటుంబ పోషణ కోసం ఇతర పనులకు నేతన్నలు
- చేనేత సంఘం పునరుద్ధరణ చేయాలని డిమాండ్

మూతపడ్డ సంఘం


చేనేత సంఘంలో మూలనపడ్డ మగ్గాలు

మూలనపడ్డ మగ్గం

కనిపించని నాటి వస్త్రకాంతులు


తాళం వేసి ఉన్న ఆమనగల్లు చేనేత సంఘ భవనం

ఆమనగల్లు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చేనేత పరిశ్రమలోకి పవర్‌లూమ్స్ వచ్చి కంప్యూటర్ డిజైన్లతో వస్త్రాలు మార్కెట్‌లోకి రావడంతో చేనేత వృత్తికి ఆదరణ తగ్గింది. ఫలితంగా ఆ రంగం సంక్షోభంలో కూరుకుపోయింది. తరాలుగా ఈ వృత్తితో జీవనం సాగిస్తున్న కార్మికులు చాలా మంది కుటుంబ పోషణకు ఇబ్బంది పడుతున్నారు. తమ కళానైపుణ్యంతో నాడు తాము బతికి మరో పదిమందికి ఉపాధి చూపి రాష్ట్రస్థాయిలో ఖ్యాతిగాంచిన ఎంతోమంది కార్మికులకు నేడు ఉపాధి కరువై దినసరి కూలీలుగా మారారు. ఒకప్పుడు పొరుగు జిల్లాల వారికి పనికల్పించి ఆదరించిన కుటుంబాలు సైతం నేడు పనికోసం పట్టణ ప్రాంతాలకు వలస పోయారు. ఆనాడు వస్త్రకాంతులు వెదజల్లిన ఆ నేత కుటుంబాలకు నేడు కుటుంబ పోషణ ఇబ్బందిగా మారింది. నాడు మగ్గాల మోతలు, ఇంటినిండా పనివారితో కళకళలాడిన చేనేత కుటుంబాలు ప్రస్తుతం కుల వృత్తిని వీడి రోడ్లపై చిరువ్యాపారాలు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. ఆమనగల్లు చేనేత కార్మికుల దయనీయ స్థితి ఇది.

పట్టు వస్త్రాల తయారీలో..

చేనేత పట్టువస్త్రాల తయారీకి ఆమనగల్లు ఒకప్పుడు ప్రసిద్ధి.ఇక్కడి కార్మికులు తయారు చేసిన పట్టు చీరలు రాష్ట్ర స్థాయిలో ఖ్యాతిని నిలిపాయి. వారి కళానైపుణ్యాన్ని చాటాయి. ఆమనగల్లు సొసైటీ కేంద్రంగా ఉమ్మడి మహబూబ్‌నగర్, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలో వందల కుటుంబాలు జీవనోపాధి పొందేవి. అప్పట్లో ఆప్కో ద్వారా ముడి సరుకులు ఇచ్చి కార్మికులు

మిగతా 8వ పేజీలో...

మూతబడిన ఆమనగల్లు సొసైటీ

దశాబ్దాల చరిత్ర కలిగిన ఆమనగల్లు సొసైటీకి ఆదరణ కరువై మూతపడింది. మగ్గాలు మూలనపడ్డాయి. లావాదేవీలు స్థంభించాయి. మగ్గాలను నడిపి, కుటుంబాలను పోషించుకునే కార్మికులు రోడ్డునపడ్డారు. ముడిసరుకుల ధరలు విపరీతంగా పెరిగిపోవడం, పవర్ లూమ్‌లు, మిల్లులు ఆవిర్భవించి ఆధునాతన కంప్యూటర్ డిజైన్లతో వస్త్రాలు మార్కెట్లోకి రావడంతో చాలా మంది చేనేత కార్మికులు కులవృత్తికి దూరమవడం జరిగింది.

కూలిపై చీరలు నేస్తున్నాం ..



పెట్టుబడులు లేకే మాస్టర్ వీవర్స్‌కు కూలిపై చీరలు నేసి ఇస్తున్నాం. జీవనోపాధిని కోల్పోయిన చేనేత కార్మికులకు ప్రభుత్వం చేయూతనందించాలి. ముడి సరుకులు సరఫరా చేసి పెట్టుబడులకు రుణ వసతి కల్పించాలి. వస్త్రాలను టెస్కో ద్వారా కొనుగోలు చేయాలి. నిధులు విడుదల చేసి సంఘంలో లావాదేవీలు జరిగేలా చర్యలు తీసుకోవాలి.

దువ్వ పరమేశ్,
నేత కార్మికుడు, ఆమనగల్లు


మాట్లాడుతున్న కలెక్టర్ నారాయణరెడ్డి

తాగునీటి ఎద్దడి రానీయొద్దు

- కలెక్టర్ నారాయణరెడ్డి

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి (ఆంధ్రజ్యోతి) : రానున్న వేసవిలో తాగునీటి ఎద్దడి రాకుండా ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లో సమీక్ష నిర్వహించారు. జిల్లాలో మిషన్ భగీరథ నీటి సరఫరా గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. వేసవిలో నీటిసరఫరాలో అంతరాయం కలగకుండా చూడాలన్నారు. పంచాయతీ నిధులతో పైప్ లైన్ లీకేజీలు లేకుండా మరమ్మతులు చేసుకోవాలన్నారు. గ్రామాల్లో ఓవర్ హెడ్ ట్యాంకుల ద్వారా నివాస ప్రాంతాలకు తాగునీరు అందేలా పనులు చేపట్టాలన్నారు. ముఖ్యంగా నీటి పంపులు, మోటర్లు, వాల్స్‌కు సంబంధించి మరమ్మతులు వెంటనే చేపట్టాలని ఆయన సూచించారు. సమావేశంలో మిషన్ భగీరథ ఈఈ రాజేశ్వర్, ఏఈలు, డీఈలు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.


టెక్నీషియన్‌కు పరికరాలు అందజేస్తున్న డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

మైత్రి సెంటర్‌ను ఉపయోగించుకోవాలి

- జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి

కందుకూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో ఏర్పాటు చేస్తున్న మైత్రి సెంటర్లను రైతులు ఉపయోగించుకోవాలని జిల్లా పశువైద్యాధికారి డాక్టర్ విజయ్‌కుమార్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని రాచులూరు పశువైద్య కేంద్రాన్ని సందర్శించిన అనంతరం మాదాపురంలో మైత్రి సెంటర్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు వైద్యం చేయడానికి ఈ కేంద్రంలో శివకుమార్ టెక్నీషియన్ అందుబాటులో ఉంటారని తెలిపారు. అంతకుముందు రాచులూరు పశువైద్య కేంద్రంలో రికార్డులను తనిఖీ చేశారు. కార్యక్రమంలో రాచులూరు పశు వైద్యాధికారి డాక్టర్ షాహిన్‌షేక్, వీఏఎస్ ఏ.రమేష్, తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యంపై అవగాహన అవసరం

కందుకూరు,ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి):గ్రామీణ ప్రాంతాల్లోని మహిళలకు పౌష్టికాహారం, ఆరోగ్యంపై అవగాహన కల్పించాలని డీఆర్‌డీవో శ్రీలత సెర్ప్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని కందుకూరు, మాడ్గుల, కడ్తాల, తలకొండపల్లి, ఆమనగల్లు మండలాలకు చెందిన సెర్ప్ సిబ్బందికి ఫుడ్ న్యూట్రీషియన్ హెల్త్ వాష్(ఎఫ్ఎన్‌హెచ్‌డబ్ల్యు) అనే అంశంపై శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి డీఆర్‌డీవో ముఖ్య అతిథిగా హాజరయ్యారు. నర్సింహ్మా, యాదయ్య, బాల్‌రాజ్ తదితరులు పాల్గొన్నారు.



పీఏసీఎస్‌ల పాలకవర్గాల గడువు పెంపు

- ఆరు నెలలు పొడిగిస్తూ ప్రభుత్వ నిర్ణయం
- ఉమ్మడి జిల్లాలో 67 సహకార సంఘాలు

రంగారెడ్డి అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): తెలంగాణలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాల (పీఏసీఎస్) పాలకవర్గ గడువును పొడిగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో మొత్తం 67 సహకార సంఘాల కాలపరిమితి, డీసీసీబీ చైర్మన్ పదవీకాలాన్ని మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. పాలక వర్గ పదవీకాలానికి ఆరు నెలల ముందే ఎన్నికల ప్రక్రియ మొదలవుతుంది. ఫిబ్రవరి 15 నాటికే గడువు ముగుస్తున్నా ఇంత వరకు రాష్ట్ర సహకార సంఘాల రిజిస్ట్రార్ నుంచి ఎలాంటి ప్రకటన విడుదల కాలేదు. ఈనేపథ్యంలో పాలవర్గ గడువును పొడిగించింది. రంగారెడ్డి జిల్లాలో 38 పీఏసీఎస్‌లు ఉండగా 2020లో 37 పీఏసీఎస్‌లకు ఎన్నికలు జరిగాయి. ప్రతి పీఏసీఎస్‌లో 13 మంది చొప్పున 37 సంఘాల్లో 481 మంది డైరెక్టర్లు మరో ఆరు నెలలపాటు కొనసాగనున్నారు. అలాగే వికారాబాద్ జిల్లాలో 21 ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాలు, ఒకరైతు సహకార సంఘం, మేడ్చల్ జిల్లాలో 9 పీఏసీఎస్‌ల్లో మరో ఆరు నెలలు పాలన కొనసాగనుంది.

రోడ్లన్నీ అధ్వానం!

అడుగుకో గుంత.. కంకర తేలి అవస్థలు

పాడైన దారులపై వాహనదారుల ఇబ్బందులు.. పట్టించుకోని పాలకులు, అధికారులు

మొయినాబాద్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల రోడ్లు అధ్వానంగా తయారయ్యాయి. అడుగుకో గుంత ఏర్పడి వాహనదారులు నరకం చూస్తున్నారు. కొన్నేళ్ల నుంచి రోడ్ల మరమ్మతులు చేపట్టకపోవడంతో భారీ గుంతలు, కంకర తేలి దారుణంగా మారాయి. ఈ రోడ్లపై వాహనదారులు వెళ్లాలంటేనే జంకుతున్నారు. గత బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో కొన్ని రోడ్లకు నిధులు మంజూరైనా పనులు జరగలేదు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది పూర్తయినా పరిస్థితి మారలేదు.

గుంతలు పడి.. కంకర తేలి

మొయినాబాద్ మండలంలోని సురంగల్- మొయినాబాద్, పెద్దమంగళారం- చందానగర్, నక్కలపల్లి, తోలుకట్ట, చాకలిగూడ, చిలుకూరు-మొయినాబాద్, వెంకటాపూర్-నక్కలపల్లి, ఎనికేపల్లి-బాకారం, హిమాయత్‌నగర్ నుంచి తంగడ్‌పల్లిరోడ్డు, చిన్నమంగళారం, వెంకటాపూర్- కనకమామిడి గ్రామాల రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఎన్నో ఏళ్లుగా నిర్వహణ కొరవడటంతో పాటు వర్షాలకు రోడ్లు దెబ్బతిన్నాయి. పెద్దపెద్ద గుంతలు ఏర్పడి, కంకరతేలి వాహనాలు నడపలేని పరిస్థితి నెలకొంది. ఈ గుంతల రోడ్లపై తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. గతంలో చిలుకూరు- మొయినాబాద్ రోడ్డుకు నిధులు మంజూరైనా పనులు మొదలు పెట్టి కంకర పోసి వదిలి పెట్టారు. దీంతో రోడుపై నడవలేని పరిస్థితి

మిగతా 8వ పేజీలో...


కంకరతేలిన మొయినాబాద్- చిలుకూరు రోడ్డు

మరమ్మతులు చేపట్టాలి



మండలంలోని రోడ్లన్నీ గుంతలమయంగా తయారయ్యాయి. వీటి గురించి ఎవరూ పట్టించుకోవడం లేదు. పాడైన రోడ్ల మీద వాహనాలపై వెళ్లాలంటే నరకం చూస్తున్నాం. గుంతల కారణంగా రాత్రి సమయంలో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇప్పటికైనా మరమ్మతులు చేపట్టి ప్రజల ఇబ్బందులు తీర్చాలి.

కుమార్, కేతిరెడ్డిపల్లి


డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి తుమ్మల నాగేశ్వర్ రావులతో మాట్లాడుతున్న వెంకటేశ్వర్‌రెడ్డి

రుణ సమస్యను పరిష్కరించండి

- ఈము రైతులను ఆదుకోవాలి

షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఈము పక్షులను పెంచి తీవ్రంగా నష్టపోయిన రైతుల రుణ సమస్యను పరిష్కరించాలని రాష్ట్ర ఈము పక్షుల పెంపకందారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు పి. వెంకటేశ్వర్‌రెడ్డి కోరారు. ఈ మేరకు శుక్రవారం హైదరాబాద్‌లో జరిగిన నాబార్డు సమావేశానికి హాజరైన ఆయన ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావులను కలిసి వినతి పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వెంకటేశ్వర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్‌ఆర్ హయాంలో ఈము పక్షుల పెంపకాన్ని చేపడితే లాభాలు వస్తాయని నాబార్డు సంస్థ రైతులను ప్రోత్సహించి, బ్యాంకుల నుంచి రుణాలు ఇప్పించిందని తెలిపారు. సొంత ఆస్తులను తాకట్టుపెట్టి పొందిన రుణంతో చేపట్టిన ఈము పక్షుల పెంపకం మార్కెట్ లేని కారణంగా తీవ్రంగా నష్టపోవాల్సి వచ్చిందని గుర్తుచేశారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కమిటీ ఇచ్చిన నివేదిక ప్రకారం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఈము రైతుల రుణ సమస్యను పరిష్కరించిందని తెలిపారు. తెలంగాణ ఈము రైతుల సమస్యను మాత్రం పదేళ్లుగా బీఆర్‌ఎస్ ప్రభుత్వం పట్టించుకోలేదు. దీంతో బ్యాంకర్ల వేధింపులు తట్టులేని కొందరు రైతులు ఆత్మహత్యలు చేసుకోగా, మరికొందరి ఆస్తులను బ్యాంకర్లు జప్తుచేశారని తెలిపారు. ప్రస్తుతం రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దాదాపు 14 కోట్ల రూపాయల అప్పులో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పరిష్కరించినట్టుగా ప్రభుత్వం 50శాతం, బ్యాంకర్లు 25శాతం, రైతులు 25శాతం రుణం చెల్లిస్తే సమస్య పరిష్కారమవుతుందని తెలిపారు.

రాముడి పేరుతో దాడులు సిగ్గుచేటు

- ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ

మొయినాబాద్ రూరల్, ఫిబ్రవరి14(ఆంధ్రజ్యోతి): రాముడి పేరుతో దాడులు చేయడం సిగ్గు చేటని నిత్యం దైవసన్నిధిలో ఉండే వారిపై ఇలాంటి దాష్టీకానికి పాల్పడటం మంచి పద్ధతి కాదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ మండిపడ్డారు. శుక్రవారం ఆయన పార్టీ బృందంతో కలిసి చిలుకూరు బాలాజీ ఆలయానికి వచ్చి రంగరాజన్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ కొన్ని సంఘాలు హిందువుల మధ్య విభేదాలను సృష్టించాలని పన్నాగం పన్నినట్లు తెలుస్తోందని ఆరోపించారు. దైవసేవలో ఉండే వారిపై దాడులు చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని ప్రభుత్వాన్ని కోరారు.

దాడులను బీజేపీ ప్రోత్సహించదు : ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి

చిలుకూరు బాలాజీ దేవాలయ ప్రధాన అర్చకుడు సీఎస్.రంగరాజన్‌పై దాడి సరైనది కాదని, ఇలాంటివి బీజేపీ ప్రోత్సహించదని ఎంపీ కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, బీజేపీ జిల్లా సీనియర్ నాయకుడు గున్నాల గోపాల్ రెడ్డి తెలిపారు. గురువారం వారు చిలుకూరుకు వెళ్లి రంగరాజన్‌తో మాట్లాడారు. రామరాజ్యం పేరిట ఇటాంటి చర్యలకు పాల్పడే వారిపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఎంపీ వెంట మాజీ ఎమ్మెల్యే రత్నం, జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు అంజన్‌కుమార్‌గౌడ్, సహదేవ్, మామిడి మధుసూదన్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు శ్రీకాంత్, షాబాద్ కిషన్, సీనియర్ నాయకులు ముంజగల్ల నర్సింగ్ రావు ఉన్నారు.


రంగరాజన్‌ను పరామర్శిస్తున్న మందకృష్ణ మాదిగ


వ్యవసాయ రంగానికి చేయూత

- ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి
- ఆదిభట్లలో జిల్లా కేంద్ర సహకార బ్యాంకు భవన నిర్మాణానికి శంకుస్థాపన


డీసీసీబీ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యేలు, డీసీసీబీ చైర్మన్

ఆదిభట్ల, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రైతు రాజ్యమే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని, ఇందు కోసం వ్యవసాయ రంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్నామని ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి తెలిపారు. శుక్రవారం ఆదిభట్ల పోలీస్‌స్టేషన్ ఎదురుగా ఉన్న ఎకరం స్థలంలో రూ.10 కోట్ల అంచనా వ్యయంతో నిర్మిస్తున్న ది హైదరాబాద్ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు ప్రధాన కార్యాలయ నూతన భవన నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమానికి తాండూరు ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి, డీసీసీబీ చైర్మన్ కొత్త కుర్మ సత్తయ్య హాజరయ్యారు. అనంతరం జరిగిన సభలో ఎమ్మెల్యే మాట్లాడుతూ.. నాంపల్లిలో ఉన్న డీసీసీబీ కార్యాలయం ఆదిభట్లకు రావడం శుభపరిణామమన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి రైతుల బాగుకోరి అబ్దుల్లాపూర్‌మెట్ మండలంలో రూ.2వేల కోట్లతో 200 ఎకరాల్లో అత్యాధునిక సౌకర్యాలతో మార్కెట్ నిర్మించబోతున్నారన్నారు. తాండూరు ఎమ్మెల్యే మాట్లాడుతూ.. తాను డీసీసీబీ చైర్మన్‌గా ఉన్న సమయంలో రూ.600 కోట్ల టర్నోవర్ ఉన్న జిల్లా కేంద్ర సహకార బ్యాంకును రూ.2 వేల కోట్ల టర్నోవర్‌తో అభివృద్ధిలోకి తెచ్చామన్నారు. నాబార్డు నుంచి అధిక నిధులు తీసుకొచ్చి జిల్లాలోని అన్ని సహకార బ్యాంకులను బలోపేతం చేశామంటూ గుర్తు చేశారు. సహకార బ్యాంకుల్లో పంట రుణాలతో పాటు ఉన్నత చదువులకు, ఇంటి నిర్మాణం కొరకు రుణాలు ఇవ్వడం జరుగుతుందన్నారు. డీసీసీబీ వైస్ చైర్మన్ రవీందర్, సీఈవో భాస్కర సుబ్రమణ్యం, జనరల్ మేనేజర్ ప్రభాకర్‌రెడ్డి, ఫణిశ్రీరాం, మార్కెట్ కమిటీ చైర్మన్లు గురునాథ్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, డీసీఎంఎస్ వైస్ చైర్మన్ మధుకర్‌రెడ్డి, పాండురంగారెడ్డి, రాజశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.





ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

● రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి

షాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రంగారెడ్డి జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు శ్రీజ్యోతి భీంభరత్ అన్నారు. షాబాద్‌లో శుక్రవారం ఆమె మాట్లాడుతూ.. తెలంగాణలో కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాక ఇచ్చిన మాట ప్రకారం అమలు చేస్తున్న గ్యారెంటీల అమలు, ప్రజాక్షేమానికి చేస్తున్న ప్రతీ పథకాన్నీ మహిళా కాంగ్రెస్ కార్యకర్తలు ప్రజల్లోకి తీసుకుపోవాలన్నారు. మహిళలకు ఉచిత రవాణ, రైతులకు రూ.2లక్షల రుణమాఫీ, రైతు భరోసా, ఇందిరమ్మ ఇస్తున్న ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానిదే అన్నారు. గత కాంగ్రెస్ ప్రభుత్వాలు రేషన్ కార్డులిచ్చాయని, మళ్లీ పదేండ్ల తరువాతే ఇప్పుడు రేషన్ కార్డులు ఇస్తున్నట్లు తెలిపారు. ప్రతి మహిళా కార్యకర్త గ్రామస్థాయి ప్రజలకు సంక్షేమ పథకాలు అందేలా చూడాలన్నారు.

పైలేరియా నిర్ధారణకు రక్త నమూనాల సేకరణ

దౌల్తాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): దౌల్తాబాద్ మండలంలోని నందారం గ్రామంలో శుక్రవారం రాత్రి పైలేరియా వ్యాధి నిర్ధారణకు ప్రజల నుంచి రక్త నమూనాలను సేకరించారు. పైలేరియా వ్యాధి నివారణలో భాగంగా వైద్యాధికారి అమూల్య ఆధ్వర్యంలో గ్రామంలో కొడంగల్ సబ్‌యూనిట్ అధికారి పకీరప్ప గ్రామస్తుల నుంచి బ్లడ్ శాంపిల్ సేకరించారు. వ్యాధి ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, నివారణ చర్యలపై అవగాహన కల్పించారు. గ్రామంలో 101 మంది రక్తనమూనాలు సేకరించారు. కార్యక్రమంలో ల్యాబ్‌టెక్నీషియన్ శ్రీధర్‌రెడ్డి, ఏఎన్ఎం విజయలక్ష్మి, ఆశా కార్యకర్తలు మంగమ్మ, శశికళ పాల్గొన్నారు.

బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా వెంకటయ్య



నియామక పత్రం అందుకుంటున్న వెంకటయ్య

తలకొండపల్లి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):బీసీ సంక్షేమ సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శిగా తలకొండపల్లి మండలం గట్టిప్పలపల్లికి చెందిన జోలం వెంకటయ్యయాదవ్, కార్యదర్శిగా వీరన్నపల్లికి చెందిన లింగంగౌడ్ నియమితులయ్యారు. శుక్రవారం హైదరాబాద్ బీసీ సంక్షేమ సంఘం కార్యాలయంలో సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య నియామకపత్రాలు అందజేశారు. బీసీల సమస్యల పరిష్కారం, హక్కుల సాధనకు చేస్తున్న కృషి చేస్తున్నారని కొనియాడారు. తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థంగా నిర్వహించి బీసీల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని వెంకటయ్య, లింగంగౌడ్ అన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ సంఘం కార్యదర్శి చెర్కు మణికంఠ, రాజు, రాజేందర్, సురేశ్‌యాదవ్, భాస్కర్ ఉన్నారు.


అనాథాశ్రమానికి సీఐ చేయూత




బియ్యం అందజేస్తున్న సీఐ

యాచారం. ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): అనాథ ఆశ్రమానికి యాచారం సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఎ.నర్సింహారావు శుక్రవారం రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు. ఆగాపల్లిలో చాలా కాలంగా ఓ అనాథ ఆశ్రమం ఉంది. పలు స్వచ్ఛంద సంస్థల నిర్వాహకులు, అధికారులు వీరికి తరచూ సాయమందిస్తూ ఆదుకుంటున్నారని సీఐ తెలుసుకున్నారు. ఆయన తన వంత సాయం ఆశ్రమ నిర్వాహకులను స్టేషన్‌కు రప్పించి రెండు క్వింటాళ్ల బియ్యం అందజేశారు.

















ఉత్సవాల్లో పాల్గొన్న మధుసూదన్‌రెడ్డి తదితరులు

ఘనంగా సంగమేశ్వరస్వామి జాతర

మొయినాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కనకమామిడి సంగమేశ్వరస్వామి జాతరను ఘనంగా నిర్వహించారు. మూడు రోజులపాటు కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. శుక్రవారం మహా మంగళహారతి, శివ తీర్థం నిర్వహించారు. స్వామివారికి అభిషేకాది పూజలు చేశారు. చివరి రోజు సమీప గ్రామస్తులు, హైదరాబాద్ నుంచి భక్తులు తరలివచ్చారు. జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఎ.మధుసూదన్‌రెడ్డి ఉత్సవాల్లోని పాల్గొన్నారు. ఆయనతో మాజీ సర్పంచ్ పి.జనార్ధన్‌రెడ్డి, ప్యాక్స్ మాజీ చైర్మన్ జగన్‌మోహన్‌రెడ్డి ఉన్నారు. ఆలయం వద్ద అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.



నిరసన తెలుపుతున్న బార్ అసోసియేషన్ సభ్యులు

జడ్జిపై దాడికి నిరసనగా విధుల బహిష్కరణ

కొడంగల్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా కోర్టులో బుధవారం మహిళా జడ్జిపైకి నిందితుడు చెప్పు విసిరిన సంఘటనను నిరసిస్తూ శుక్రవారం కొడంగల్‌లో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విధులను బహిష్కరించారు. బార్ అధ్యక్షుడు బి.వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి భాగ్యలత మాట్లాడుతూ.. ఇది న్యాయ వ్యవస్థపై, రాజ్యాంగ చట్టాలపై జరిగిన దాడిగా అభివర్ణించారు. నిందుతుడిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదులు పి.వెంకట్‌రెడ్డి, ఎవీ.ఆనంద్, పి.సుధాకర్‌రెడ్డి, టి.కరుణాకర్‌రెడ్డి, యు.బస్వరాజ్, మురళీ మోహన్ నామాజీ, వెంకటయ్య, కె.రాములు, బి.కృష్ణయ్య, కె.రమేష్, పి.భానుప్రసాద్, రవీందర్, మొహిద్ పాల్గొన్నారు.

యువత సంస్కృతిని మరువొద్దు



షాద్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): స్వేచ్ఛ పేరుతో యువతీ, యువకులు భారత సంస్కృతి, సంప్రదాయాలను మరవొద్దని బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు యెంకన్నోళ్ల వెంకటేష్ అన్నారు. శుక్రవారం ఆయన మాట్లాడుతూ.. ప్రేమికుల రోజు పేరిట మనదికాని పాశ్చాత్య కల్చర్‌ను ప్రవేశపెట్టి, భారతీయ సంస్కృతిని విచ్ఛిన్నం చేయాలనే కుట్ర చేస్తున్నారని అన్నారు. పట్టుదలతో చదివి, జీవితంలో ఉన్నత స్థాయికి ఎదిగేందుకు శ్రమించాల్సిన విద్యార్థులు ప్రేమ పేరుతో జీవితాలను పాడుచేసుకోవద్దని కోరారు. బాధ్యత కల్గిన ప్రతీ పౌరుడు ప్రేమికుల దినోత్సవాన్ని కాకుండా ఫిబ్రవరి 14వ తేదీని దేశం కోసం ప్రాణత్యాగం చేసిన వీర జవాన్లకు అంకితమిచ్చి, వారి ఆత్మకు శాంతి చేకూరేలా సామాజిక కార్యక్రమాలు నిర్వహించాలని వెంకటేష్ కోరారు.

గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేయొద్దు

కేశంపేట, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేయొద్దని బొదునంపల్లి గ్రామస్తులు శుక్రవారం రాష్ట్రపతి ముర్ము, ప్రధానమంత్రి నరేంద్రమోదీలకు పోస్టుకార్డులను పంపారు. గ్రామ కూడలిలో ర్యాలీ నిర్వహించి, పోస్టు కార్డులను ప్రదర్శించారు. గొప్పపేరున్న జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థను ప్రైవేట్‌పరం చేస్తే అందులోని ఉద్యోగుల రోడ్డున పడతారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో లింగారెడ్డి, అంజనేయులుగౌడ్, పిప్పల మల్లయ్య, కోటయ్య, రాములు, లక్ష్మయ్య, యాదయ్య, నరసింహ, బాలరాజు, చెన్నయ్య, మల్లయ్య, తిరుపతి, రాములు, శంకరయ్య, లక్ష్మమ్మ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల పట్టాలివ్వాలి

చేవెళ్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గుడిసెలు వేసుకున్న పేదలకు పట్టాలివ్వాలని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు రామస్వామి అన్నారు. చేవెళ్లలో భూపోరాట కేంద్రంలో రెండో వార్షికోత్సవాన్ని జరపుకున్నారు. ఆయన మాట్లాడుతూ.. రెండేళ్లుగా భూపోరాట కేంద్రంలో తాగునీరు, విద్యుత్, వంటి సౌకర్యాలు లేకున్నా ఇండ్ల పట్టాల కోసం భూపోరాటం చేస్తున్న పేదలను అభినందించారు. ప్రభుత్వం స్పందించి వారికి ఇళ్లు కట్టివ్వాలన్నారు. కార్యక్రమంలో సీపీఐ మండల కార్యదర్శి సత్తిరెడ్డి, ఏఐకేఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రభులింగం, సభ్యుడు సుధాకర్‌గౌడ్, బీకేఎంయూ జిల్లా అధ్యక్షుడు అంజయ్య, మొయినాబాద్, షాబాద్ కార్యదర్శులు శ్రీనివాస్, జంగయ్య, మక్బుల్, మంజుల, శివబాబురావు, లలితమ్మ, సుగుణమ్మ, రమాదేవి, పెంటయ్య, శ్రీకాంత్, యాదగిరి ఉన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన కాంగ్రెస్ నాయకులు



కడ్తాల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర పంచాయతీ రాజ్ శాఖ మంత్రి సీతక్కను శుక్రవారం ఆమనగల్లు, కడ్తాల్, మాడ్గుల, తలకొండపల్లి మండలాల కాంగ్రెస్ నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని గాంధీభవన్‌లో పీసీసీ సభ్యుడు ఐళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డిల ఆధ్వర్యంలో వివిధ మండలాల నాయకులు మంత్రిని శాలువాలతో సత్కరించారు. కల్వకుర్తి నియోజవకర్గ అభివృద్ధికి నిధులిచ్చి సహకరించాలని కోరగా మంత్రి సానుకూలంగా స్పందించారని తెలిపారు. మంత్రిని కలిసిన వారిలో మండలాల కాంగ్రెస్ అధ్యక్షులు జగన్, డోకూరు ప్రభాకర్‌రెడ్డి, బిచ్యానాయక్ ఉన్నారు.

ఘనంగా గద్యత్రయ పారాయణం

- వైభంగా కొనసాగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు
- హాజరైన సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ



పూజలు నిర్వహిస్తున్న సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ

శంషాబాద్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ముచ్చింతల్ సమతామూర్తి స్ఫూర్తి కేంద్రంలో ఆధ్యాత్మిక గురువు చిన జీయర్‌స్వామి ఆధ్వర్యంలో జరుగుతున్న సమతా కుంభ్ బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభంగా కొనసాగుతున్నాయి. శుక్రవారం గద్యత్రయ పారాయణం చేపట్టారు. ఉత్సవాల్లో సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ పాల్గొన్ని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం చిన జీయర్‌స్వామి ఆశీస్సులు తీసుకున్నారు. స్వామిజీ ఆయనకు తీర్థప్రసాదాలు అందజేసి, మంగళశాసనములు అందజేశారు. కార్యక్రమంలో అహోబిల జీయర్‌స్వామి, దేవానాథ జీయర్‌స్వామి, మైహోంగ్రూప్ అధినేత జూపల్లి రామేశ్వర్ రావు కుటుంబ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బండెల ఎల్లమ్మ జాతర



కొడంగల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కోరిన కోర్కెలు తీర్చే బండెల ఎల్లమ్మ జాతర శుక్రవారం ప్రారంభమైంది. మూడు రోజులు జరిగే జాతరకు కొడంగల్, పరిసర గ్రామాల ప్రజలు తరలివస్తారు. మొదటి రోజు ప్రధాన ఘట్టం సిడె కనులపండగగా నిర్వహించారు. శుక్రవారం కొడంగల్‌లోని వివిధ కాలనీ మహిళలు బోనాలతో ర్యాలీగా బయలుదేరి నైవేద్యం సమర్పించారు. కొడంగల్ ఏఎంసీ మాజీ వైస్‌చైర్ పర్సన్ వాణిశ్రీయాదవ్, రెండో వార్డు కౌన్సిలర్ మధుసూదన్‌యాదవ్‌ల ఆధ్వర్యంలో మహిళలు బోనాలతో వెళ్లి ఆలయంలో పూజలు నిర్వహించారు.

ప్రజల నిర్లక్ష్యం..

పశువుల పాలిట శాపం

రోడ్ల పక్కన చెత్త పారబోత

- ప్లాస్టిక్ కవర్లు తింటూ అనారోగ్యం బారిన..
- ఆవులు, దూడల మృత్యువాత
- చర్యలు తీసుకోని మున్సిపల్ అధికారులు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఖాళీ స్థలాలు, రోడ్ల పక్కన పారబోస్తున్న చెత్త, ప్లాస్టిక్ కవర్లు మూగజీవాల పాలిట శాపంగా పరిణమిస్తున్నాయి. స్థానిక రైతులకు చెందిన ఆవులు, ఎడ్లు, గొర్లు, మేకలు, ఇతర సాధు జంతువులు పదుల సంఖ్యలో పట్టణంలో సంచరిస్తుంటాయి. మేత లేక చెత్త, ప్లాస్టిక్ కవర్లు తింటున్నాయి. తిన్న ప్లాస్టిక్ కవర్లు కడుపులో పేరుకుపోయి కొన్ని రోజులకే పశువులు మృత్యువాత పడుతున్నాయి.



రోడ్లపై సంచరిస్తున్న ఆవులు, దూడలు



పారేసిన ప్లాస్టిక్ కవర్లను తింటున్న పశువులు

ఎక్కడికక్కడ చెత్త వేయడం వల్లే..

పట్టణంలోని అన్ని వార్డులకు రెండు రోజులకోసారి చెత్తసేకరణ వాహనం వస్తోంది. చెత్తసేకరణ చేసే కార్మికులకు నెలకు రూ.70 నుంచి రూ.199 ఇవ్వాల్సి ఉంటుంది. వారికి డబ్బులివ్వాల్సి వస్తుందని చాలా మంది రాత్రిపూట చెత్తనంతా రోడ్లపక్కన పారబోస్తున్నారు. తెల్లవారి మున్సిపల్ సిబ్బంది దానిని తీసుకెళ్తున్నారు. అయితే అంతలోనే పశువులు ప్లాస్టిక్ కవర్లు తినేస్తున్నాయి. పశువులను రోడ్లపైకి వదిలితే గోశాలలకు తరలిస్తామని గతంలో మున్సిపల్ అధికారులు పశుపోషకులకు, రైతులకు చాటింపు వేయించారు. అయినా ఇది అమలుకు నోచుకోలేదు. పశుపోషకులు కూడా వాటిని కట్టేయకుండా రోడ్లపై విడిచి పెడుతున్నారు. పశువులు రాత్రింబవళ్లు రోడ్లపై సంచరిస్తూ అక్కడే పడుకుంటున్నాయి. ట్రాఫిక్‌కు అంతరాయమూ కలుగుతోంది. ప్రమాదాలూ జరుగుతున్నాయి. కొన్ని రోజుల క్రితం చౌరస్తాలో ఓ ప్రైవేట్ ఉపాధ్యాయుడు బైక్‌తో ఓ పశువును ఢీకొట్టి చనిపోయాడు. పట్టణంలో పశువులు తిరుగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేశారు. అయినా ఆచరణకు నోచుకోలేదు. రాత్రి పూట దుకాణాల వద్ద పడుకొని అక్కడే పేడ వేస్తున్నాయి. రోడ్డు పక్కన నాటిన మొక్కలను మేస్తున్నాయి.

చాలా సార్లు ఫిర్యాదు చేశాం



పశువులు ప్లాస్టిక్ కవర్లు తిని అనారోగ్యం బారిన పడుతున్నాయి. రోడ్లపై తిరిగే ఆవులు, దూడలను గోశాలలకు తరలించాలని మున్సిపల్ అధికారులకు మేం ఫిర్యాదు చేశాం. వారేమీ పట్టించుకోవడం లేదు. చూడలేక ఓసారి మేమే గోశాలకు తరలించాం. పశువుల యజమాని పోలీసులకు ఫిర్యాదు చేసి వాటిని తీసుకువెళ్లాడు. మళ్లా రోడ్లపైకే వదుళ్తున్నారు. దీనిపై అధికారులే చర్యలు తీసుకోవాలి.

- చెట్ల వెంకటేష్, హిందూ వాహిని నాయకుడు



గట్టుపల్లిలో రాష్ట్ర యువజన కాంగ్రెస్ శిక్షణ తరగతులు?

మహేశ్వరం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యువజన కాంగ్రెస్ రాష్ట్ర స్థాయి ముఖ్య నాయకుల శిక్షణ తరగతులు మహేశ్వరం మండలం గట్టుపల్లిలో గల కేసీఆర్ రిసార్ట్‌లో ఈ నెల 16 నుంచి 18వ తేదీ వరకు నిర్వహించేందుకు కాంగ్రెస్ నాయకులు ఏర్పాట్లు చేస్తున్నారు. యువజన కాంగ్రెస్ శిక్షణ తరగతులకు ముఖ్యమంత్రి, పీసీసీ చీఫ్, పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలుస్తోంది. నూతనంగా రాష్ట్ర యువజన కాంగ్రెస్ నేతల నియామకాలు జరిగిన నేపథ్యంలో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను విస్తృతంగా ప్రజల్లోకి తీసుకెళ్లి స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీని గెలిపించుకునేలా యువ నాయకులు శిక్షణిస్తారని సమాచారం. మూడు రోజుల ఈ శిక్షణా తరగతులకు సీఎం రేవంత్‌రెడ్డి, కొందరు మంత్రులు, ఎమ్మెల్యేలు, పార్టీ ముఖ్య నాయకులు హాజరవుతారని తెలుస్తున్నా దానిపై వివరించేందుకు కాంగ్రెస్ నాయకులు సుముఖంగా లేరు. ఈ శిక్షణ తరగతులకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల నుంచి 250 మంది వరకు యువజన కాంగ్రెస్ నాయకులు హాజరవుతారని తెలుస్తోంది. ఇదిలా ఉంటే శిక్షణ తరగతులకు స్థానిక కాంగ్రెస్ నాయకులకు, ముఖ్య కార్యకర్తలకు, మీడియా ప్రతినిధులకు కూడా అనుమతి లేదని తెలుస్తోంది.

పన్ను వసూళ్ల లక్ష్యం చేరకుంటే వేటు

- సీడీఎంఏ అధికారుల వార్నింగ్
- రశీదులు లేకుండా పన్ను వసూళ్లు నిజమే : కమిషనర్



ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

తాండూరు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మున్సిపాలిటీలో ఆస్తిపన్ను వసూళ్లలో మున్సిపల్ సిబ్బంది, అధికారుల నిర్లక్ష్యాన్ని సహించేది లేదని, లక్ష్యం మేరకు ట్యాక్స్‌లు వసూలు చేయకుంటే బాధ్యులపై వేటు తప్పదని కమిషనర్‌కు రాష్ట్ర స్థాయి మున్సిపల్ పరిపాలన డైరెక్టరేట్(సీడీఎంఏ) అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. పనిచేయని సిబ్బందిపై చర్యలెందుకు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వంద శాతం పన్ను వసూలు చేయకుంటే సస్పెండ్ చేస్తామని స్పష్టం చేశారు. దీంతో శుక్రవారం మున్సిపల్ కిందిస్థాయి సిబ్బంది నుంచి కమిషనర్ వరకు పన్నుల వసూళ్లకు రంగంలోకి దిగారు. 'పన్నుల వసూళ్లలో తాండూరు లాస్ట్' అనే శీర్షికన శుక్రవారం ఆంధ్రజ్యోతిలో ప్రచురితమైన కథనానికి సీడీఎంఏ ఉన్నతాధికారులు, మున్సిపల్ కమిషనర్ స్పందించారు. మున్సిపాలిటీలో బడ్జెట్ లేక సాధారణ పనులు, మైనర్ పనులు కూడా చేయడం లేదు. గతంలో ఓ మున్సిపల్ జవాన్ తానే అధికారిలా వ్యవహరించి ట్రేడ్ లైసెన్స్ పేరిట డబ్బులు వసూలు చేసి మున్సిపాలిటీ ట్రెజరీకి జమచేయలేదు. ఈ విషయాన్ని సైతం ఆంధ్రజ్యోతి ప్రచురించింది. దీంతో కమిషనర్ విక్రంసింహారెడ్డి స్పందించారు. విలేకరుల సమావేశాన్ని ఏర్పాటు చేసి మున్సిపల్ రశీదు లేకుండా పట్టణ ప్రజలైనా, వ్యాపారులైనా డబ్బులు చెల్లించొద్దని, పన్ను ఆన్‌లైన్‌లో చెల్లించినా లేదా నగదు ఇచ్చినా రశీదు తప్పక పొందాలని సూచించారు. ఆన్‌లైన్ చెల్లింపులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. మున్సిపాలిటీ కేటాయించి ఉద్యోగికి మాత్రమే డబ్బు కట్టి రశీదు పొందాలన్నారు. కొందరు సిబ్బంది మున్సిపల్ ట్యాక్సులు వసూలు చేసి సొంతానికి వాడుకున్నట్టు తెలిసిందని కమిషనర్ చెప్పారు. అలాంటి వారు మున్సిపల్ ట్రెజరీకి వెంటనే డబ్బులు జమచేయాలని ఆదేశించారు. బకాయిల వసూళ్లకు ఇప్పటికే రెడ్ నోటీసులు జారీ చేశామని తెలిపారు.

మంత్రి ద్వారా సీడీఎంఏకు ఫోన్?

పన్ను వసూళ్లలో వెనకబడ్డారని తాండూరు మున్సిపల్ అధికారులను ఇప్పటికే సీడీఎంఏ అధికారులు పలుమార్లు టెలీ కాన్ఫరెన్స్‌లో హెచ్చరించారు. ఇప్పుడు చర్యలకు ఉపక్రమించారు. తనపై వేటు పడుతుందేమోనని తాండూరు మున్సిపల్ అధికారి ఒకరు ఉమ్మడి మెదక్ జిల్లాకు చెందిన ఓ మంత్రి ద్వారా సీడీఎంఏ కార్యాలయానికి ఫోన్ చేయించుకున్నట్టు తెలుస్తోంది. పన్ను వసూళ్ల లక్ష్యాన్ని పూర్తి చేస్తామని, తనకు ఒక అవకాశం ఇవ్వాలని సదరు అధికారి రాష్ట్ర అధికారులను వేడుకోగా వారు చివరి అవకాశం ఇచ్చినట్టు తెలుస్తోంది. మార్చి నాటికి లక్ష్యం మేరకు పన్ను వసూలు చేయకుంటే వేటుతప్పదని ఉన్నతాధికారులు తేల్చి చెప్పినట్టు సమాచారం.

26.79కిలోల గంజాయి స్వాధీనం

వికారాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఓ వ్యక్తి గంజాయిని రవాణా చేస్తున్నాడనే సమాచారంతో ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి ఆదేశాలతో అధికారులు దాడులు చేశారు. నిందితుడి నుంచి 26.79కిలోల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటన వికారాబాద్‌లో చోటుచేసుకుంది. ఎక్సైజ్ సూపరింటెండెంట్ విజయభాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. శుక్రవారం ఓ వ్యక్తి గంజాయి రవాణా చేస్తున్నాడని సమాచారమొచ్చింది. ఎక్సైజ్ అసిస్టెంట్ సూపరింటెండెంట్ శ్రీనివాస్‌రెడ్డి, వికారాబాద్ ఎక్సైజ్, టాస్క్‌ఫోర్స్ అధికారు టలు దాడులు నిర్వహించారు. వికారాబాద్ రైల్వేస్టేషన్ రెస్ట్‌హౌస్ వద్ద పశ్చిమ బెంగాల్‌కు చెందిన సన్నీసేథ్ నుంచి గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించారు. దాడుల్లో ఎస్ఐ ప్రేమ్ కుమార్‌రెడ్డి, సిబ్బంది విష్ణువర్ధన్‌రెడ్డి, శివ, రాంగణేష్, మహేందర్ కుమార్, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై పోరాటాలు చేయాలి

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రజాసమస్యలపై నిరంతర పోరాటాలు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి జాన్‌వెస్లీ పార్టీ శ్రేణులకు పిలుపునిచ్చారు. శుక్రవారం ఇబ్రహీంపట్నంలోని పాషా నరహరిస్మారక కేంద్రంలో జరిగిన పార్టీ జిల్లా సమావేశంలో మాట్లాడారు. ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మాట ప్రకారం ఫార్మాసిటీని రద్దు చేయాలన్నారు. బలవంతపు భూసేకరణ చేయొద్దంటూ హైకోర్టు ఇచ్చిన తీర్పును అమలు చేయాలని డిమాండ్ చేశారు. రామోజీఫిలిం సిటీ వద్ద గతంలో ఇచ్చిన పట్టాల మేరకు పేదలకు స్థలాలు కేటాయించాలన్నారు. కప్పాడులో బినామీ భూములను పేదలకు పంచాలన్నారు. ఎస్సీ వర్గీకరణను సీపీఎం స్వాగతిస్తోందని, దీనికోసం చట్టం తీసుకురావాలన్నారు. బీసీలకు 42శాతం రిజర్వేషన్‌ను అమలుచేసి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ మేరకు సీట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో సీపీఎం జిల్లా కార్యదర్శి పి.యాదయ్య, భాస్కర్, సామేల్, బుగ్గ రాములు పాల్గొన్నారు.

జాబ్‌మేళాతో 3వేల మందికి ఉద్యోగాలు

ఆమనగల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): యువతకు ఉద్యోగ, ఉపాధి కల్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని టాస్క్ సీవోవో సుంకిరెడ్డి రాఘవేందర్‌రెడ్డి అన్నారు. ఐక్యత ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన జాబ్‌మేళాలో ప్రముఖ ఎలక్ట్రానిక్స్ కంపెనీలో ఉద్యోగాలు సాధించిన కల్వకుర్తి నియోజకవర్గంలోని చౌదర్‌పల్లి, గొల్లోనిప ల్లి గ్రామాల యువతకు శుక్రవారం టాస్క్ కార్యాలయంలో రాఘవేందర్‌రెడ్డి నియామక పత్రాలందజేశారు. కల్వకుర్తి నియోజకవర్గంలో టాస్క్ ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్య శిక్షణ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తామని తెలిపారు. కల్వకుర్తి నియోజకవర్గంలో 3వేల మంది మహిళలకు ఉపాధి, యువతకు ఉద్యోగాలు కల్పించేలా జాబ్‌మేళా నిర్వహిస్తామని రాఘవేందర్‌రెడ్డి చెప్పారు. కార్యక్రమంలో ఫౌండేషన్ సభ్యులు శ్రీనివాస్‌రెడ్డి, అభినవ్‌రెడ్డి, చంద్రశేఖర్, కొండల్, శ్రీరాములు, తదితరులు పాల్గొన్నారు.



సంగీత కచేరిని తిలకిస్తున్న హైదరాబాద్ కలెక్టర్ అనుదీప్

విద్యార్థులు సంగీతంలో ప్రావీణ్యం సాధించాలి

ఘట్‌కేసర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతో పాటు సంగీత ప్రావీణ్యం కల్పించేందుకు ప్రభుత్వం కృషిచేస్తోందని హైదరాబాద్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. ఎదులాబాద్‌లోని సాంఘిక సంక్షేమ ఫైన్ ఆర్ట్స్ గురుకుల పాఠశాలలో శుక్రవారం రాత్రి స్పిక్ మెక్ సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కర్ణాటక సంగీత కచేరికి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేశారు. ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు చదువుతో లలిత కళలు, సంగీతంపై ఆసక్తి పెంచుకుంటూ రాణించాలని సూచించారు. భారతీయ కళలు కనుమరుగు కాకుండా నేటి తరం పాటుపడాలన్నారు. కర్ణాటక సంగీత విద్వాంసురాలు గీత రాజా ఆధ్వర్యంలో కచేరిని ఏర్పాటు చేసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గురుకుల విద్యాసంస్థల సంయుక్త కార్యదర్శి సక్రు, ఓఎస్డీ పీఎస్ఆర్.శర్మ, రాష్ట్రస్థాయి అధికారి భీమయ్య ప్రిన్సిపాల్ రాము, వైస్‌ప్రిన్సిపాల్ రాములు, స్పిక్ మెక్ వలంటీర్ వీణారెడ్డి, టీచర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

చట్టాల గురించి తెలుసుకోవాలి

- న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి శీతల్



న్యాయవిజ్ఞాన సదస్సులో మాట్లాడుతున్న జడ్జి శీతల్

పరిగి, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ప్రాథమిక దశ నుంచే చట్టాలపై అవగాహన పెంచుకోవాలని న్యాయ సేవాధికార సంస్థ జిల్లా కార్యదర్శి జిల్లా జడ్జి డీబీ శీతల్ అన్నారు. పరిగిలోని ఎంజేపీటీబీసీడబ్ల్యూఆర్ స్కూల్‌లో శుక్రవారం చట్టాలపై అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా జడ్జి మాట్లాడుతూ.. విద్యతోపాటు చట్టాల గురించి తెలుసుకోవాలని, విద్యార్థులు చిన్నప్పటి నుంచే ఉన్నత లక్ష్యాలు పెట్టుకొని ఆ దిశగా కృషి చేయాలని సూచించారు. చదువుకున్న వారి జీవన విధానం ఇతరులకు భిన్నంగా ఉంటుందన్నారు. ప్రాథమిక దశలో క్రమశిక్షణ లేకపోతే చెడుదారిని పట్టే అవకాశం ఉందన్నారు. బాలికలకు ఎలాంటి ఇబ్బదులు ఎదురైనా, వేధింపులకు గురైనా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలని సూచించారు. పోలీసులు స్పందించకపోతే నేరుగా తనను కలిసి ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటానని తెలిపారు. బాల్యవివాహాలు, బాలకార్మిక నిర్మూలనకు అందరూ కృషి చేయాలన్నారు. 18ఏళ్ల లోపు బాలికలకు పెళ్లి చేయొద్దని, అది నేరం అని, ఎక్కడైనా జరిగితే తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో న్యాయవాదులు రాము, శ్రీనివాస్, పరిగి లీగల్ ఎయిడ్ న్యాయవాది ఎండీ గౌస్‌పాషా, ప్రిన్సిపాల్ హరిత, ఉపాధ్యాయులు సౌజన్య, జ్యోతి, రేణుక తదితరులు పాల్గొన్నారు.

బోగస్ చెక్కులిచ్చి భూములు కాజేశారు!

- అధికారులకు రైతుల మొర



తహసీల్దార్ కార్యాలయం వద్ద చెక్కులు చూపుతున్న రైతులు

కులకచర్ల, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి):భూమి తాకట్టు(మార్ట్‌గేజ్) పెట్టుకొని డబ్బిస్తామని చెప్పి ఏకంగా సేల్‌డీడ్ రిజిస్ట్రేషన్ చేసుకొని, రైతులకు డబ్బులివ్వకుండా మొత్తం భూమినే కాజేసిన వైనం కులకచర్ల మండలంలో వెలుగు చూసింది. అప్పు కోసం ఆశ్రయిస్తే భూమి లాగేసుకున్నారని రైతులు తహసీల్దార్‌కు, పోలీసులకు శుక్రవారం ఫిర్యాదు చేశారు. అంతారంలో జరిగిన ఈ ఘటన ఆలస్యంగా వెలుగుచూసింది. అంతారానికి చెందిన రైతులు లింగంగారి వెంకటేశ్, కావలి పాండు, కృష్ణయ్య, లక్ష్మయ్య, రాములు, శ్రీనివాస్‌లకు ఐదెకరాల 32గుంటల భూమి ఉంది. భూమి తాకట్టుపెట్టి డబ్బులిప్పించాలని మాజీ సర్పంచ్ కృష్ణను ఆశ్రయించారు. తనకు తెలిసిన ఫైనాన్సర్లు ఉన్నారని, భూమి తాకట్టు పడితే నూటికి రెండు రూపాయల చొప్పున వడ్డీతో రూ.40లక్షల అప్పు ఇస్తారని మాజీ సర్పంచ్ తెలిపాడు. దీనికి రైతులు అంగీకరించారు. గత నవంబరు 28న తహసీల్దార్ కార్యాలయంలో హైదరాబాద్‌కు చెందిన దేవిరెడ్డి రత్నమ్మకు భూమి రిజిస్ట్రేషన్ చేశారు. అయితే అది తాకట్టేనని రైతులు అనుకున్నారు. రైతులకు మాయమాటలు చెప్పి సేల్‌డీడ్‌తో రిజిస్రేషన్ చేసుకున్నారు. అదే రోజు డబ్బులిస్తామని మాజీ సర్పంచ్ కృష్ణ తెలిపాడు. కానీ రైతులకు డబ్బు ఇవ్వలేదు. డబ్బులు తేలేదని మూడు చెక్కులు(రూ.25లక్షలు, రూ.10లక్షలు, రూ.5లక్షలు) ఇచ్చారు. చెక్కులను షాద్‌నగర్ ఐసీఐసీఐ బ్యాంక్ పేరిట ఇచ్చారు. రైతులు రెండు రోజుల అనంతరం బ్యాంక్‌కు వెళ్లి డబ్బులిమ్మనగా ఆ ఖాతాలో డబ్బులు లేవని బ్యాంకర్లు చెప్పారు. అలాగే భూమిని మార్ట్‌గేజ్ కాకుండా సెల్‌డీడ్ చేసుకున్నట్టు రైతులు గ్రహించారు. ఈ మోసంపై మాజీ సర్పంచ్‌ని రైతులు నిలదీశారు. కృష్ణ తనకు తెలియదని చెప్పాడు. రైతుల కోరిక మేరకు మధ్యవర్తులపై కృష్ణ పోలీసులకు ఫిర్యాదు చేసినా పోలీసులు చర్యలు తీసుకోలేదు. దీంతో రైతులు రెండు రోజుల క్రితం ఎస్సై అన్వేష్‌రెడ్డి, తహసీల్దార్ మురళీధర్‌కు ఫిర్యాదు చేశారు. శుక్రవారం కార్యాలయానికి వచ్చి తమకు న్యాయం చేయాలని కోరారు. వారికిచ్చిన చెక్కులను విలేకరులకు చూపారు. మాజీ సర్పంచ్ కృష్ణ, షాద్‌నగర్‌కు చెందిన మనోజ్, గణేశ్, సత్యం, మురళి, రాంనాయక్, నిఖిల్‌రెడ్డిలపై తాము పోలీసులకు ఫిర్యాదు చేశామని తెలిపారు. ఈ విషయంపై ఎస్సై, తహసీల్దార్‌లు వివరణిస్తూ.. తమకు రైతులు ఫిర్యాదు చేశారని, విచారణ చేస్తామని తెలిపారు.

రైతు దీక్షకు 18న కేటీఆర్ రాక

ఆమనగల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వ రైతు, ప్రజా వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఈనెల 18న ఆమనగల్లు పట్టణంలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు దీక్ష కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు పోనుగోటి అర్జున్‌రావు తెలిపారు. దీక్షకు కేటీఆర్ హాజరవుతున్నట్లు చెప్పారు. ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం అర్జున్‌రావు విలేకరులతో మాట్లాడుతూ రైతు దీక్షకు పెద్దఎత్తున ఏర్పాట్లు చేస్తున్నట్లు చెప్పారు. మాడ్గుల రోడ్డులోని ప్రభుత్వ కళాశాల మైదానంలో ఉదయం 11 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు దీక్ష కొనసాగుతుందని వివరించారు. నియోజకవర్గంలోని ఆరు మండలాల నుంచి దీక్షకు జన సమీకరణ చేస్తున్నట్లు ఆయన తెలిపారు.

కప్పాడులో పశు వైద్యశిబిరం

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి: కప్పాడులో పశు సంవర్ధక శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం పశు వైద్యశిబిరం నిర్వహించారు. గర్భకోశ వ్యాధులు, సాధారణ వ్యాధులకు చికిత్సలు చేశారు. వంద పశువులకు నట్టల నివారణ మందులు, 30 పశువులకు గర్భకోశవ్యాధుల చికిత్సలు, 25 పశువులకు పాల దిగుబడి పెంచే మందులు పంపిణీ చేసినట్లు ఎలిమినేడు పశు వైద్యాధికారి ఆనంద్‌రెడ్డి చెప్పారు. గోపాల మిత్రలు జగన్, వెంకట్‌రెడ్డి, సురేందర్, సతీష్ తదితరులున్నారు.

వైభవంగా గరుడ సేవ

- లక్ష్మీచెన్నకేశవ స్వామి ఆలయంలో ముగిసిన బ్రహ్మోత్సవాలు
- కడ్తాలతో పాటు సమీప గ్రామాల భక్తజనంతో ఆలయం కిటకిట


కడ్తాల్ : గరుడ సేవలో నాయకులు, ఆలయ నిర్వాహకులు

కడ్తాల్, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయంలో బ్రహ్మోత్సవాలు శుక్రవారం వైభవంగా ముగిశాయి. వారం రోజుల పాటు వేడుకలు కనుల పండువగా జరిగాయి. కడ్తాలతో పాటు సమీప గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు ఉత్సవాలకు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ముగింపు వేడుకల్లో భాగంగా అమ్మవారికి ప్రత్యేక పూజలు, చక్రతీర్థం, గరుడ సేవ ఊరేగింపు, నాగవల్లి కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు స్వామివారిని దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గూడూరు లక్ష్మీనర్సింహారెడ్డి, మాజీ ఎంపీటీసీ గూడూరు శ్రీనివాస్ రెడ్డి, ఆలయ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు పాలాది ఆంజనేయులు, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహ, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్య నాయక్, ఈవో మోహన్ రావు, ఆలయ అర్చకులు, స్థానిక నాయకులున్నారు


నందిగామ : ప్రత్యేక పూజల్లో ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్

ఘనంగా ఉత్సవమూర్తుల ఊరేగింపు

ఆమనగల్లు : పట్టణంలోని అయ్యప్ప కొండ వద్దగల శ్రీ భవాని రామలింగేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం తృతీయ వార్షికోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగే వేడుకల కోసం ఆలయాన్ని పచ్చటి తోరణాలు, పుష్పాలతో శోభాయమానంగా అలంకరించారు. నిర్వాహకుడు రేగటి శ్రీనివాసులు ఆధ్వర్యంలో భక్తులకు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. తొలిరోజు మహాగణపతి పూజ, కంకణ ధారణ, గణపతి హోమం, ఉత్సవ విగ్రహాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు చంద్రశేఖర్‌స్వామి, మల్లిఖార్జున్, మహేశ్, అక్షయ్, మహేశ్, శివకుమార్, రేగటి శ్రీలత, యాదమ్మ, తదితరులు పాల్గొన్నారు.


ఆమనగల్లు : పూజల్లో భక్తులు

సాయిబాబా ఆలయ వార్షికోత్సవం

నందిగామ : మండల పరిధిలోని చేగూర్‌లో గల సాయిబాబ దేవాలయం 17వ వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్, మాజీ ఎంపీపీ శివశంకర్ గౌడ్, పీఏసీఎస్ మాజీ చైర్మన్ మామిళ్ల విఠల్, ఇతర నాయకులు, భక్తులు సాయిబాబా ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. గ్రామంలో స్వామివారి పల్లకీ సేవ నిర్వహించారు. అనంతరం గ్రామాని కి చెందిన కాంగ్రెస్ నాయకుడు ఆవుల శివ సహకారంతో అన్నదానం చేశారు. మాజీ ఎంపీపీ ప్రియాంక, స ర్పంచ్ పాండయ్య, నాయకులు శ్రీశైలం, రాజశేఖర్, శివ, మల్ రెడ్డి, బుచ్చయ్య, సాములయ్య, మల్లేష్, కావలి కృష్ణ, సీతారాం, కొమ్ము కృష్ణ, చంద్రపాల్‌రెడ్డి, కుమార్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, మల్లేష్ గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

క్రైం కార్నర్

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

- నలుగురికి గాయాలు.. తప్పిన పెను ముప్పు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): షాద్‌నగర్ పట్టణంలోని పరిగి రోడ్డులో ఆర్టీసీ బస్సును లారీ ఢీకొన్న ప్రమాదంలో నలుగురు ప్రయాణికులకు గాయాలైనాయి. ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ కథనం ప్రకారం.. మహబూబ్‌నగర్ డిపోకు చెందిన ఎక్స్‌ప్రెస్ బస్సు షాద్‌నగర్ డిపోనుంచి బస్సు బయటికి వచ్చి పరిగి రోడ్డులోని పోచమ్మ దేవాలయం వద్ద యూటర్న్ తీసుకుంటోంది. ఈక్రమంలో పరిగి వైపు నుంచి వచ్చిన లారీ బస్సును ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులోని నలుగురు ప్రయాణికులు గాయాలు కాగా.. షాద్‌నగర్ కమ్యూనిటీ ఆసుపత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

345 టన్నుల ఇసుక సీజ్.. 10మందిపై కేసు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఇబ్రహీంపట్నం పరిధిలో అక్రమంగా ఇసుక విక్రయాలు జరుపుతున్న పది మందిపై కేసులు నమోదు చేసి 345 టన్నుల ఇసుకను సీజ్ చేసినట్లు సీఐ జగదీష్ శుక్రవారం తెలిపారు. అక్కడక్కడ ఏర్పాటుచేసిన దంగుల్లో నిల్వచేసి విక్రయాలు జరుపుతున్నందున దాడులు నిర్వహించామన్నారు.

పాత కక్షలతో వ్యక్తిపై దాడి.. కేసు నమోదు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): పాత కక్షలతో దౌర్జన్యంగా ఇంట్లోకి ప్రవేశించి వ్యక్తిపై దాడి చేసిన మరో వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీనర్సిహ కాలనీకి చెందిన ఆర్ఎన్ రవీందర్ ఈనెల 8న రాత్రి ఇంట్లో ఉండగా.. ఇంజమూరు గోపాల్ అనే వ్యక్తి ఇంట్లోకి ప్రవేశించి ఒక్కసారిగా దాడి చేశారని బాధితుడు తెలిపాడు. పైగా అడ్డు వచ్చిన తన తల్లిని కూడా దుర్భాషలాడినట్లు తెలిపారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఇన్‌స్పెక్టర్ తెలిపారు.

చెరువులో దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

- కాపాడిన పోలీసులు

ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): కుటుంబ సమస్యలతో ఓ మహిళ ఇబ్రహీంపట్నం చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడడంతో పోలీసులు ఆమెను బయటకు తీసి రక్షించారు. ఇబ్రహీంపట్నం టౌన్ బృందావన్ కాలనీలో నివాసముంటున్న ఏలేటి జంగమ్మ శుక్రవారం రాత్రి 9గంటల ప్రాంతంలో ఇబ్రహీంపట్నం చెరువు పెద్దతూము వద్ద కిందికి చెరువులో దూకి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. అటుగా వెళ్తున్నవారు చూసి డయల్ 100కు కాల్ చేయగా.. అప్పటికే ఆ దారిగుండా వెళ్తున్న టీజీఎస్పీ కానిస్టేబుల్ జగదీశ్, పెట్రో మొబైల్ టీం ఆమెను బయటకు తీసి ఇబ్రహీంపట్నం సీహెచ్‌సీకి తరలించగా చికిత్స పొందుతోంది. ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని పోలీసులు తెలిపారు.

ఘనంగా షబ్-ఏ- బరాత్


ఆమనగల్లు : మాట్లాడుతున్న అబ్దుల్ వాహేద్

ఆమనగల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఆమనగల్లు పట్టణంలోని జామా మజీద్, మహ్దీయ మజీద్, మషీద్ షైమాదే హిలాల్‌లో షబ్-ఏ-బరాత్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. గురువారం రాత్రి ముస్లింలు మజీద్‌లో నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. జాగరణ చేసి ఖురాన్ పఠనం గావించారు. ఇమామ్ అబ్దుల్ వాహేద్, లతీఫ్‌ల ఆధ్వర్యంలో దువ్వ కార్యక్రమం చేపట్టారు.

కడ్తాల : మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాల్లో ముస్లింలు షబ్-ఏ-బరాత్ వేడుకలు జరుపుకున్నారు. మండల కేంద్రంలోని మసీద్ ఖుబా, మసీద్ అర్షద్‌లలో ఇమామ్‌లు జహీరోద్దీన్, మౌలానల ఆధ్వర్యంలో నమాజ్ చేసి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు.

ఘనంగా గంధోత్సవం

మాడ్గుల : మండలంలోని నల్లచెర్వు గ్రామ సమీపాన గుట్టపై నూతనంగా నిర్మించిన దర్గాలో కట్ట పెద్దయ్య ఆధ్వర్యంలో శుక్రవారం గంధోత్సవం నిర్వహించారు. నల్లచెర్వు నుంచి అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో వడ్డేపల్లి నవీన్‌గౌడ్, కట్ట జగన్, కట్ట శంకరయ్య, మాజీ ఉపసర్పంచ్ రాశిక మల్లయ్య, కాస వెంకటయ్యలు పాల్గొన్నారు.


మాడ్గుల : గంధోత్సవంలో గ్రామస్తులు

అమరుల త్యాగాలు మరువలేనివి


కొందుర్గు : కొవ్వొత్తుల ర్యాలీలో యువకులు

కడ్తాల్/చేవెళ్ల/శంకర్‌పల్లి/చౌదరిగూడ, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): దేశం ప్రాణాలర్పించిన అమర వీర జవానుల త్యాగం ఎన్నటికీ మరువలేమని పీసీసీ సభ్యుడు ఆయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎర్రోళ్ళ రాఘవేందర్, డీసీసీ అధికార ప్రతినిధి గూడూరు శ్రీనివాస్‌రెడ్డి, ఆమనగల్లు బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు యాట నర్సింహలు అన్నారు. కడ్తాల మండల కేంద్రంలో శుక్రవారం యువజన సంఘాల ఐక్యవేదిక ఆధ్వర్యంలో పుల్వామా దాడిలో అమరులైన 43మంది జవానులకు నివాళి అర్పించారు. బీజేపీ మండలాధ్యక్షుడు మహేశ్, కాంగ్రెస్ మండలాధ్యక్షుడు బీచ్యానాయక్, తదితరులు పాల్గొన్నారు. అలాగే పుల్వామాదాడిలో అమరులైన వీర జవాన్లకు, సుష్మాస్వరాజ్ జయంతి సందర్భంగా చేవెళ్లలో బీజేపీ మండలాధ్యక్షుడు అనంతరెడ్డి ఆధ్వర్యంలో నివాళులర్పించారు. శ్రీనివాస్, విఠలయ్య, మధుకర్ రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, జయసింహారెడ్డి తదితరులున్నారు. అలాగే శంకర్‌పల్లిలోని లిటిల్‌స్టార్ హైస్కూల్‌లో జవాన్లకు శ్రద్ధాంజలి ఘటించారు. కరస్పాండెంట్ సంజీవ్‌కుమార్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. పుల్వామా దాడి అమర జవాన్లను స్మరించుకుంటూ శుక్రవారం సాయంత్రం కొందుర్గు మండల కేంద్రంలోని బస్టాండ్ ఆవరణలోని శివాజీ విగ్రహం వద్ద యువకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

మూతపడ్డ సంఘం మూలనపడ్డ మగ్గం

(5వ పేజీ తరువాయి)

నేసిన వస్త్రాలను కొనుగోలు చేసేవారు. స్థానిక చేనేత సంఘంలో 100 వరకు మగ్గాలు నడిచేవి. 500 మంది నేత కార్మికులకు ఉపాధి లభించేది. కాగా టెస్కో నుంచి ప్రస్తుతం ముడిసరుకు ఇవ్వకపోగా నేసిన వాటిని కూడ కొనుగోలు చేయకపోవడంతో విధిలేక కొంతమంది చేనేత వృత్తినే నమ్ముకున్న కార్మికులు ప్రైవేట్ వివర్ మాస్టర్స్ వద్ద దినసరి కూలీలుగా పనిచేస్తున్నారు.

గత వైభవం ఘనం

1948లో ఉమ్మడి పాలమూరు, నల్గొండ, రంగారెడ్డి జిల్లాల పరిధిలోని 90 గ్రామాలకు చెందిన 1,110 మంది చేనేత కార్మికులు ఒక్కొక్కరు రూ.30 వాటా ధనంతో ఆమనగల్లు చేనేత సహకార సంఘాన్ని స్థాపించుకున్నారు. సంఘం కార్యకలాపాల కోసం పాత అంగడిబజార్‌లో భవనం నిర్మించారు. అందులో వందల సంఖ్యలో మగ్గాలు ఏర్పాటుచేసి కార్మికులకు ఉపాధి కల్పించారు. ఇళ్ళ వద్దనే నేసే కార్మికులకు కూడ సొసైటీ ముడి సరుకులను అందించింది. సొసైటీ కేంద్రంలో వందలాది కుటుంబాలు జీవనోపాధి పొందాయి. కార్మికులు నేసిన వస్త్రాలు అమ్ముకోవడానికి రంగారెడ్డి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్ జిల్లాల పరిధిలోని ఆమనగల్లు, కడ్తాల, చారకొండ, అచ్చంపేట , కల్వకుర్తి, జడ్చర్ల తదితర పట్టణాలలో చేనేత విక్రయ కేంద్రాలను ఏర్పాటుచేశారు.

ప్రస్తుతం దయనీయం

ఆమనగల్లు చేనేత సంఘం రెండు దశాబ్దాలుగా మూతపడింది. ఆదరణ కరువై కార్మికులు దయనీయ జీవితాలు వెల్లదీస్తున్నారు. 2003లో అప్పటి టీడీపీ ప్రభుత్వం సొసైటీ సభ్యత్వం వాటా రూ.500లకు పెంచడంతో ఆర్థికపరమైన ఇబ్బందులతో చాలమంది సభ్యులు రెన్యువల్ చేయించుకోలేక పోయారు. కాలక్రమంలో 500మంది సభ్యులకు 38మంది మాత్రమే మిగిలారు. ఎన్నికలు సైతం వారితోనే నిర్వహించారు. 1992 నుంచి సంఘం కొందరి స్వార్థం, నిధుల దుర్వినియోగం, నేతల అలక్ష్యంతో లావాదేవీలు స్తంభించిపోయి మగ్గాలు మూలనపడ్డాయి. హెల్త్‌ప్యాకేజీ స్కీం కింద 1993లో నిర్మించిన ప్రాథమిక ఆరోగ్య కేంద్రమూ మూతపడింది. చేనేత వస్త్ర విక్రయశాల కూడా లావాదేవీలు లేక మూతపడింది.

ప్రతిపాదనలకే పరిమితం...

చేనేత సహకార సంఘం నూతన భవన నిర్మాణం ప్రతిపాధనలకే పరిమితమైంది. స్థానిక ఎస్‌బీహెచ్ సమీపంలో శ్రీశైలం - హైద్రాబాద్ జాతీయ రహదారి రోడ్డును అనుసరించి సంఘానికి 333 చదరపు గజాల స్థలం ఉంది. కొత్త భవన నిర్మాణం గురించి అధికారులు, ప్రజా ప్రతినిధులు హామీ ఇచ్చి ఏళ్లు గడుస్తున్నా నేటికి కార్యరూపం దాల్చలేదు. భవన నిర్మాణం చేపట్టే స్థలాన్ని కాపాడాలని సంఘం నాయకులు దశాబ్దాలుగా కోరతున్నా పాలక ప్రభుత్వాలు, నేతలు పట్టించుకోవడం లేదు.

ఉపాధి కోసం పాట్లు

మూతపడిన ఆమనగల్లు చేనేత సహకార సంఘం మూతపడటంతో తిరిగి పునరుద్ధిస్తారని, తమకు స్థానికంగా పని దొరుకుతుందని కార్మికులు చాలకాలం ఎదురుచూశారు. ఫలితం లేకపోవడంతో ఆశలు వదులుకొని పరిశ్రమల్లో, ఇతర చోట్ల పనులు వెతుక్కుంటూ వెళ్లారు. కొందరు స్థానికంగా బట్టలు, చెప్పులు, ఉల్లిగడ్డ, ఎల్లిగడ్డ, కూరగాయలు, మిర్చి బండ్లు, టీ కొట్లు, టీవీ రిపేరింగ్, పాన్‌షాప్‌లు, తదితర చిరు వ్యాపారాలు నిర్వహించుకుంటూ జీవనం గడుపుతున్నారు. అదేవిధంగా పట్టువస్త్రాల తయారీలో నైపుణ్యం ఉన్న 22 మంది చేనేత కార్మికులు మాస్టర్ వీవర్స్ నుంచి ముడి సరుకులు తీసుకొని కూలీపై పట్టుచీరలు నేసి ఇస్తూ జీవనం సాగిస్తున్నారు. కాగా, వారికి ప్రభుత్వ ఆదేశం మేరకు జియోట్యాగ్ నెంబర్స్ కేటాయించారు. వారికి మాత్రమే త్రిఫిట ఫండ్, ఇతర ప్రభుత్వ సాయం అందుతుంది.

సొసైటీని పునరుద్ధరించాలి



మూతబడ్డ ఆమనగల్లు చేనేత సంఘాన్ని తిరిగి పునరుద్ధరించాలి. కార్మికులకు పని కల్పించాలి. అభయ హస్తం ద్వారా చేనేత కార్మికులందరికీ ప్రభుత్వం చేయూతనందించాలి. సొంతంగా మగ్గం నేసే చేనేత కార్మికులకూ రూ.5 లక్షల వరకు వడ్డీలేని రుణాలు అందించాలి. నేసిన వస్త్రాలను టెస్కో ద్వారా ప్రభుత్వమే కొనుగోలు చేయాలి. గతంలో మాదిరిగా 50 ఏళ్లు పైబడిన కార్మికులందరికి ఫించన్లు అందించి ఆదుకోవాలి. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో పెద్ద పీట వేయాలి. అన్ని మండల కేంద్రాల్లో విక్రయశాలలు ఏర్పాటు చేయాలి. సంఘం నూతన భవన నిర్మాణానికి రూ. 5 కోట్లు మంజూరు చేసి పాత భవనానికి మరమ్మతులు చేయాలి.

- గాజుల శ్రీనివాస్, చేనేత సంఘం అధ్యక్షుడు, ఆమనగల్లు

'స్థానిక' ఎన్నికల్లో సత్తా చాటుదాం


సీఎంఆర్ఎఫ్ చెక్కు అందిస్తున్న భీంభరత్

షాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తా చాటుదామని కాంగ్రెస్ పార్టీ చేవెళ్ల నియోజకవర్గ ఇన్‌చార్జి పామెన భీంభరత్ అన్నారు. శుక్రవారం మండల పరిధిలోని లక్ష్మారావుగూడకు చెందిన అమృతరెడ్డికి మంజూరైన రూ.60వేల సీఎంఆర్ఎఫ్ చెక్కును ఆయన అందజేశారు. నాయకులు పెంటారెడ్డి, సుభాష్‌చంద్రబోస్, వెంకటయ్య, నరహరిచారి, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

న్యాయమూర్తిపై దాడి హేయం


ఇబ్రహీంపట్నం : నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

ఆమనగల్లు/ఇబ్రహీంపట్నం, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): రంగారెడ్డి జిల్లా 9వ అదనపు జిల్లాకోర్టు న్యాయమూర్తి హరీషపై దాడి చేయడాన్ని నిరసిస్తూ ఆమనగల్లు పట్టణంలో శుక్రవారం న్యాయవాదులు విధులను బహిష్కరించారు. నల్లబ్యాడ్జీలు ధరించి కోర్టు ఎదుట నిరసన తెలిపారు. జిల్లా న్యాయమూర్తిపై దాడిని ఆమనగల్లు బార్‌అసోసియేషన్ సభ్యులు, న్యాయ వాదులు తీవ్రంగా ఖండించారు. ఒక జిల్లా జడ్జీపై యావజ్జీవ శిక్ష పడ్డ నేరస్థుడు దాడి హేయమని, ఇటువంటి దాడులు పునరావృత్తకాకుండ ప్రభుత్వం కఠిన చర్యలు తీసుకోవాలని కోరారు. బార్ అసోసియషన్ అధ్యక్షుడు మల్లెపల్లి జగన్, ప్రధాన కార్యదర్శి దుడ్డు ఆంజనేయులు, సీనియర్ న్యాయవాది యాదిలాల్, న్యాయవాదులు పాల్గొన్నారు. దాడిని నిరసిస్తూ ఇబ్రహీంపట్నం కోర్టులో న్యాయవాదులు న్యాయమూర్తికి సంఘీభావంగా విధులు బహిష్కరించి నిరసన తెలిపారు. ఇబ్రహీంపట్నం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు అంజన్‌రెడ్డి మాట్లాడుతూ కోర్టులో న్యాయమూర్తులకు రక్షణ కల్పించాల్సిన అవసరముందన్నారు. అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జేపీ మహేందర్ తదితరులున్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి

చౌదరిగూడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ప్రమాదాలు జరగవని షాద్‌నగర్ రూరల్ సీఐ నర్సయ్య అన్నారు. శుక్రవారం జిల్లేడ్ చౌదరిగూడ మండల పరిధిలోని లాల్‌పహాడ్‌లో పోలీస్ సిబ్బందితో కలిసి వాహనాలను తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ వాహనదారులు మద్యం సేవించి డ్రైవింగ్ చేసినా, ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించినా చట్టరీత్యా చర్యలు తప్పవన్నారు. తల్లిదండ్రులు మైనర్‌లకు వాహనాలను ఇవ్వకూడదన్నారు. తనిఖీలో జిల్లేడ్ చౌదరిగూడ ఎస్సై విజయ్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఫరూఖ్‌నగర్‌లో పోలీసుల తనిఖీలు

షాద్‌నగర్ రూరల్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ఫరూఖ్‌నగర్‌లో శుక్రవారం రాత్రి పోలీసులు విస్తృత తనిఖీలు నిర్వహించారు. హోటళ్లు, కిరాణా షాపులు, పలు చోట్ల తనిఖీలు చేశారు. శంషాబాద్ డీసీపీ రాజేష్ ఆదేశాల మేరకు షాద్‌నగర్ ఏసీపీ రంగస్వామి పర్యవేక్షణలో ఇన్‌స్పెక్టర్ విజకుమార్ ఆధ్వర్యంలో తనిఖీలు చేశారు. గంజాయి, గుట్కా విక్రయిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ట్రాఫిక్ ఉల్లంఘన కేసులు 5, బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగుతున్న వారిపై 5 కేసులు, గుట్కా కేసు ఒకటి నమోదు చేసినట్లు ఇన్‌స్పెక్టర్ విజయ్‌కుమార్ తెలిపారు.

ప్రైవేట్ ఆసుపత్రులు ఉచిత వైద్య సేవలందించాలి

ఆమనగల్లు, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): గ్రామీణ పేద ప్రజలకు ఉచిత వైద్య సేవలందించేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రైవేట్ ఆసుపత్రుల నిర్వాహకులు ముందుకు రావాలని ఆమనగల్లు సీఐ ప్రమోద్ కుమార్ కోరారు. ఆమనగల్లు పట్టణంలోని శ్రీ సత్య ఆసుపత్రి వద్ద శుక్రవారం ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. హైదరాబాద్ మెడిసిటీ ఆసుపత్రి సహకారంతో ఏర్పాటు చేసిన శిబిరాన్ని డాక్టర్ బికుమాండ్ల శ్రీనివాస్‌తో కలిసి సీఐ ప్రారంభించారు. డాక్టర్ అనుపమ, రాకేశ్, సత్యనారాయణ, శ్రీనివాసులు బృందం 250 మందికి వివిధ పరీక్షలు నిర్వహించారు. ఆరోగ్య సంరక్షణ, పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించారు. కంటి వైద్య సహాయకురాలు కోట్ల శ్రావణి, శ్రీను, సైదులు, ఆశాకిరణ్, సురేశ్, వీరబొమ్మ రామ్మోహన్, బికుమాండ్ల నర్సింహ, తేజవర్ధన్, కృష్ణయ్య, మంజుల, బాబా, సుందూరు శేఖర్, గుర్రం సురేశ్, తదితరులు పాల్గొన్నారు.



డా.శ్రీనివాస్‌తో కలిసి శిబిరాన్ని ప్రారంభిస్తున్న సీఐ ప్రమోద్

ముమ్మరంగా బీటీ రోడ్ల నిర్మాణం : కసిరెడ్డి

ఆమనగల్లు, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): కల్వకుర్తి నియోజకవర్గంలోని అన్ని గ్రామాల, తండాల పంచాయతీ రాజ్ రోడ్లను ఆధునీకరించి అభివృద్ధి చేసి రవాణా సౌకర్యం కల్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందించి అమలు చేస్తుందని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణ రెడ్డి అన్నారు. ఆరు మండలాల పరిధిలో 296 కిలోమీటర్ల పీఆర్ రోడ్లను హ్యామ్ పద్దతిలో విస్తరించి వేగవంతంగా అభివృద్ధి చేయడానికి సర్వే ప్రారంభమైందన్నారు. శుక్రవారం హైదరాబాద్‌లోని తన నివాసంలో గ్రామీణ రోడ్ల మరమ్మతులు, ఆధునీకరణపై ఎమ్మెల్యే అధికారులు, ప్రజాప్రతినిదులు, నాయకులతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటికే ప్రారంభించిన అన్ని రోడ్లను నాణ్యతగా, వేగవంతంగా చేపట్టాలని ఆదేశించారు. ఆమనగల్లు మండలం శెట్టిపల్లి నుంచి దొడ్ల పహాడ్ రోడ్డు, ఫీరోజ్ నగర్ రోడ్లను బీటీ గా మార్చాలని స్థానిక మాజీ సర్పంచ్ గోదాదేవి, కాంగ్రెస్ జిల్లా సీనియన్ నాయకుడు ఎగిరిశెట్టి సత్యంలు ఎమ్మెల్యేను కోరుతూ వినతిపత్రమి చ్చారు. ఆమనగల్లు మాజీ మార్కెట్ చైర్మన్ కిషన్‌రెడ్డి, కొండల్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, రమేశ్, బాబా, రవీందర్, అనంతరెడ్డి, లక్‌పతినాయక్, నరేశ్‌నాయక్, సంపత్, విజయ్‌రాథోడ్ ఉన్నారు.

ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాలమహానాడు ఆధ్వర్యంలో బంద్

తలకొండపల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణను వ్యతిరేకిస్తూ మాల మహానాడు రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపు మేరకు తలకొండపల్లి మండల కేంద్రంలో శుక్రవారం బంద్ నిర్వహించారు. ప్రైవేట్ పాఠశాలల నిర్వాహకులు స్వచ్ఛందంగా బంద్ పాటించారు. మాల మహానాడు నాయకులు మండల కేంద్రంలో నిరసన ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట బైటాయించి ధర్నా చేపట్టారు. రాజ్యాంగానికి విరుద్ధంగా వర్గీకరణ చేయడం సరికాదన్నారు. మాలలకు కూడ సమన్యాయం చేయాలని కోరారు. నాయకులు తుమ్మ నర్సింహ, మల్లేశ్, నర్సింహ్మా, కిరణ్‌కుమార్, పురుషోత్తం, శ్రీను, గోపాల్, శంకర్, విజయ్, తదితరులు ఉన్నారు.

'బోరు'తో తప్పిన తాగునీటి ఇక్కట్లు


బోరు నీటిని పరిశీలిస్తున్న ఆర్టీసీ అధికారులు

చౌదరిగూడ, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): ప్రయాణికుల దాహార్తిని తీర్చేందుకు ఆర్టీసీ అధికారులు బోరు వేయించారు. శుక్రవారం కొందుర్గు మండల కేంద్రంలోని ఆర్టీసీ బస్టాండ్ ఆవరణలో మహబూబ్‌నగర్ ఆర్టీసీ డిప్యూటీ డీఈ ప్రసాద్ ఆధ్వర్యంలో బోరు వేయించారు. 50 ఫీట్ల లోతులో నీరు పడటంతో సంతోషం వ్యక్తం చేశారు. ప్రయాణికులకు నీటి వసతి కల్పించేందుకు సౌకర్యవంతంగా ఉంటుందన్నారు. త్వరలో కొందుర్గు ఆర్టీసీ బస్టాండ్‌కు ప్రహరీ నిర్మాణ పనులు చేపట్టనున్నట్లు డీడీఈ ప్రసాద్ తెలిపారు.

మరకత శివాలయ సందర్శనకు డీజీపీకి ఆహ్వానం

శంకర్‌పల్లి, ఫిబ్రవరి 14 (ఆంధ్రజ్యోతి): చందిప్పలోని మరకత శివాలయ ప్రచార కమిటీ చైర్మన్ దయాకర్‌రాజు డీజీపీ జితేందర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. శుక్రవారం డీజీపీని ఆయన నివాసంలో కలిసి శాలువాతో సన్మానించి, ఆలయ జ్ఞాపికను అందజేశారు. 11వ శతాబ్దానికి చెందిన మరకత శివాలయం యొక్క విశిష్ఠతను వివరించి, ఆలయాన్ని సందర్శించాలని ఆహ్వానించగా త్వరలో దర్శనానికి రానున్నట్లు డీజీపీ తెలిపినట్లు దయాకర్‌రాజు పేర్కొన్నారు.



రోడ్లన్నీ అధ్వానం!

(5వ పేజీ తరువాయి)

ఏర్పడింది. వెంకటాపూర్- కనకనమామిడి రోడ్డు పనులు సైతం పనులు చేపట్టలేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా స్పందించి రోడ్ల మరమ్మతులు చేపట్టాలని ప్రజలు కోరుతున్నారు.


ప్రమాదకరంగా హిమాయత్‌నగర్-తంగడ్‌పల్లి రోడ్డు

పంచాయతీరాజ్ టూ ఆర్అండ్‌బీకి మార్పు

మండలంలోని చందానగర్ చౌరస్తా నుంచి పెద్దమంగళారం, మొయినాబాద్, సురంగల్, శ్రీరాంనగర్, వెంకటాపూర్ గ్రామాల మీదుగా కవేలీగూడ వరకు రోడ్డు పూర్తిగా పాడైంది. అయితే ఈ రోడ్డు నిర్మాణానికి అత్యధికంగా నిధులు అవసరం ఉండటంతో పంచాయతీరాజ్ నుంచి ఆర్అండ్‌బీకి మార్చి మరమ్మతులు చేయాలని స్థానిక కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు రాష్ట్ర రోడ్డు భవనాల శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డికి విన్నవించారు. ఇందుకు ఆయన అంగీకరించారు. ఈ రోడ్డును ఆర్అండ్‌బీకి మార్చి త్వరలోనే పనులు చేపడుతామని తెలిపారు. అదే జరిగితే వాహనదారుల సమస్య తీరుతుంది.

ప్రతిపాదనలు పంపించాం



మండలంలోని వివిధ గ్రామాల రోడ్లు పాడయ్యాయి. అయితే వాటి మరమ్మతులకు సంబంధించి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించడం జరిగింది. వెంకటాపూర్- కనకమామిడి గ్రామాల రోడ్డుకు నిధులు మంజూరయ్యాయి. పవులు ప్రారంభిస్తాం. చిలుకూరు రోడ్డుకు సైతం నిధులు మంజూరై పనులు జరుగుతున్నాయి.

విజయ్‌కుమార్, పంచాయతీరాజ్ డీడీఈ, మొయినాబాద్

విద్యుత్ సరఫరాలో నేడు అంతరాయం

షాబాద్, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని అంతారం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధి కుర్వగూడ, సర్దార్‌నగర్, కక్కులూర్, కేసారం, అంతారం, బోడంపహాడ్, మన్‌మర్రి, అప్పారెడ్డిగూడ గ్రామాల్లో నేడు(శనివారం) ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ కోటేశ్వర్‌రావు తెలిపారు. విద్యుత్ మరమ్మతుల కారణంగా అంతరాయం ఏర్పడుతుందని చెప్పారు.

అపరిచితులతో అప్రమత్తంగా ఉండాలి


ప్రజలతో మాట్లాడుతున్న పోలీసులు

యాచారం, ఫిబ్రవరి 14(ఆంధ్రజ్యోతి): మహిళలు యువకులు ఒంటరిగా ఉన్న సమయంలో విలువైన ఆభరణాలు ధరించరాదని, అపరిచితుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసులు తెలిపారు. శుక్రవారం నాగార్జున సాగర్-హైదరాబాద్ ప్రధాన రహదారిపై ప్రజలకు కౌన్సిలింగ్ ఇచ్చారు. గుర్తుతెలియని నెంబర్ల నుంచి ఫోన్‌కాల్ వస్తే ఎత్తరాదని చెప్పారు. పరీక్షల సమయంలో విద్యార్థులకు సెల్‌ఫోన్లు ఇవ్వరాదని కోరారు. హెడ్‌కానిస్టేబుల్ రాములు, మహిళా కానిస్టేబుళ్లు సంతోష, అలివేలు ఉన్నారు.